సంతలో వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- మూత్రశాలలు కూడా లేని దుస్థితి
- పట్టించుకోని అధికారులు

మానవపాడు: పంచాయతీలకు ఆదాయవనరుగా ఉన్న వారాంతపు సంతల్లో మౌలిక వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో విక్రయదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి వసతులు కల్పించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి బుధవారం రద్దీగా..

ప్రతి బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారాంతపు సంతకు భలే గిరాకీ ఉంటుంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో సంతలో కూరగాయలు, సరుకులు విక్రయిస్తుంటారు. కానీ సంతలో ప్రత్యేక స్థలాలు, షెడ్లు, ఇరువైపులా డేరాల కూడా లేవని వ్యాపారులు, ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా మహిళలు తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూపర్‌మార్కెట్లుగా పేరు..

మారుమూల గ్రామాల్లో నిర్వహించే వారాంతపు సంతలకు పల్లెటూరి సూపర్ మార్కెట్లుగా పేరుంది. మండలంలోని గోకులపాడు, చెన్నిపాడు, మానవపాడు, అమరవాయి, పెద్ద ఆముదాలపాడు, నారాయణపురం, జల్లాపురం, బోరవెల్లి, పోతులపాడు , కలుకుంట్ల ప్రజలు వారాంతపు సంతకు వందల సంఖ్యలో వస్తుంటారు.

సౌకర్యాలు కల్పించని అధికారులు..

గతకొన్ని సంవత్సరాలుగా వారాంతపు సంతల్లో మౌలిక వసతులు కల్పించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద సంత నిర్వహించేవారు. గత 3 సంవత్సరాల నుంచి రైతువేదిక పక్కనే వారసంతం నిర్వహిస్తున్నారు. వారంతపు సంత ఎప్పుడు జరుగుతుందో ఎప్పుడు అయిపోతుందో అన్నట్లు జరుగుతుంది. విద్యుత్ దీపాలు లేక చీకటిమయంగా ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉంటాయని వ్యాపారులు వాపోతున్నారు. వర్షం కురిసిన సమయంలో కూరగాయలు, వస్తువుల తడిసి పాడైపోతున్నాయని ఆందోళన చెంతున్నారు.



మానవపాడులో వసతులు లేని వారాంతపు సంత(ఫైల్)

అధికారులు చర్యలు తీసుకోవాలి..



వారాంతపు సంతలో అధికారులు ప్రజలకు, వ్యాపారులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. గ్రామ పంచాయతీ ఆధీనంలో సంత స్థలం ఉంది. వ్యాపారుస్తులకు డేరాలు, విద్యుత్ దీపాలు, మౌలిక వసతులు కల్పించి ప్రతి సంత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలి. - ముఖీమ్, అమరవాయి

నీడ వసతి లేదు ..



ప్రతి బుధవారం నిర్వహించే వారాంతపు సంతో ఆకుకూరలు, నిమ్మకాయలు విక్రయిస్తుంటాను. సంతలో నీడ వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. రాత్రి అయిందంటే ఎంతో కొంతకు అమ్ముకోని వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నాం.

-ఆంజనేయులు వ్యాపారస్తుడు మానవపాడు

మరుగుదొడ్లు నిర్మించాలి..



ప్రతి బుధవారం నిర్వహించే వారాంతపు సంతకు తప్పకుండా వస్తుంటాం. వారసంత నిర్వాహణలో మౌలిక వసుతులు లేక తీవ్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగు నీటి సౌకర్యాలు లేవు.

- రవికుమార్, గోకులపాడు

క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులు గురువారం పంపిణీ చేశారు. ఉండవెల్లి మండలం శేరుపల్లికి చెందిన రేవతికి రూ.9 వేలు, ఇటిక్యాల మండలం బట్లదిన్నెకు చెందిన వాసుగౌడ్‌కు రూ.60 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

మల్దకల్: నర్సరీల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ నిర్వాహకులకు సూచించారు. గురువారం బూడిదపాడు గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నీరందించడంతో పాటు ఎండల నుంచి రక్షించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో జాబ్‌కార్డులు ఉన్న కూలీలందరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


రాజోళి: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దతాండ్రపాడులోని 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ మెయింటెన్స్, మరమ్మతు, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పెద్దతాండ్రపాడు, ముండ్లదిన్నె గ్రామాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు



ఎర్రవల్లి: కొబ్బరి చెట్టుపై పిడుగు పడి ప్రమాదం తప్పిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని దువాసిపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఉరుములతో కూడిన ఈదురు గాలులు వీచడంతో ఒక్కసారిగా గ్రామానికి చెందిన ఈశ్వర్ ఇంటి సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పిడుగు పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పిడుగు ధాటికి కొబ్బరి చెట్టుకు మంటలు వ్యాపించడంతో కాలిపోయింది.

క్రీడా మైదానం పరిశీలన



అయిజ: అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని బీయూపీఎస్ పాఠశాల ఆవరణలో ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర ఇన్విటేషన్ కబడ్డీ మహిళా విభాగం టోర్నమెంట్ పోటీలకు క్రీడా మైదానాన్ని గురువారం నిర్వాహకులు పరిశీలించారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యోబు, అంజి, రాజు, దేవరాజు, ఎర్రన్న, స్నేహరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ట్యాబ్ చోరీ

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలలో ట్యాబ్ అపహరించిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెంకట్రామనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య తెలిపారు. పాఠశాలలోని పాత బీరువాలో గత మంగళవారం ఉంచిన ట్యాబ్ గురువారం కనిపించకపోవడంతో ఉపాధ్యాయురాలు రూపారాణి ఎంఈఓ నరసింహకు ఫిర్యాదు చేశారు. అనంతరం దొంగతనపై చర్యలు తీసుకోవాలని శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

అక్రమ కనెక్షన్ల తొలగింపు

మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా పైప్‌లైన్‌లకు అక్రమ కనెక్షన్ ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఏఈ రాఘవేంద్ర అన్నారు. గురువారం మండలంలోని నారాయణపురంలో అక్రమ కనెక్షన్లను తొలగించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు కనెక్షన్లు ఏర్పాటు చేయడం అక్రమమన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



ధరూరు: తలకొండపల్లిలో ఈనెల 13న నిర్వహించనున్న భీం దీక్ష ముగింపు సభ వాల్‌పోస్టర్‌ను ఎస్‌ఐ శ్రీహరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఇంట్లో పుస్తకాల గది ఉండాలని, అలాగే స్వేరో నెట్‌వర్క్ ఆధ్వర్యంలో అక్షరం– ఆరోగ్యం– ఆర్థికం అనే నినాదంతో వివిధ దేశాల్లో స్వేరో నెట్‌వర్క్ అద్భుతంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్వేరో సభ్యులు దేవన్న, రఫి, గోపసాల్‌రెడ్డి, అశోక్, సుధాకర్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుకు శ్రీకారం

సాక్షి ఎఫెక్ట్..

అయిజ: ఇటీవల సాక్షి పత్రికలో ప్రచురించిన రోడ్లను పునర్నిర్మించరూ? కథనానికి అధికారులు స్పందించారు. శిథిలమైన అయిజ–గట్టు రోడ్డుకు గురువారం మరమ్మతు (ప్యాచ్ వర్క్) పనులు ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా శిథిలమైన రోడ్డుపై ప్రయాణికులు నిత్యం ప్రమాదాలకు గురయ్యారు. ఏడాది క్రితం రోడ్డు మరమ్మతు పనులు చేసేందుకు కాంట్రాక్టర్ రోడ్డుపై కంకర పరిచి వదిలేశాడు. కంకర్రపై ద్విచక్ర వాహనాలు నడిపేందుకు వాహనదారులు ఆపసోపాలు పడేవారు. సాక్షి పత్రికలో వచ్చిన వరుస కథనాలకు అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు సాక్షిని అభినందించారు.



అయిజ–గట్టు రోడ్డుకు చేపడుతున్న మరమ్మతు

గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



అయిజలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



ధరూరు వైఎస్సార్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ధరూరు: వంట గ్యాస్ సిలిండర్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు,. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో సిలిండర్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నర్సింహ మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గితే ఏ దేశంలోనైనా వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గుతాయని భారతదేశంలో భిన్నంగా ధరలు పెంచుతున్నారని మండిపడ్డారు. ప్రజల ఉపాధి ఆదాయాన్ని పెంచాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో మండల నాయకులు మేకల నర్సింహులు, దేవదాసు, తిమ్మప్ప, మోష, రాము, ఆంజనేయులు, ప్రవీణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయం వలన సబ్సిడి, సబ్సిడీ యేతర వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఈశ్వర్, కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్, శ్రీనివాసులు, భీమన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల పరిశీలన



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఓ నర్సింగరావు

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని కోయిల్‌దిన్నె, రామాపురం, జక్కిరెడ్డిపల్లిలో జరుగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను డీఆర్‌డీఓ నర్సింగరావు గురువారం పరిశీలించారు. కోళ్ల ఫారం, ఉద్యానవనశాఖ ద్వారా మంజూరైన పండ్ల తోటల పనులు, ఉపాధి పనులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను పెంచాలని, పండ్ల తోటల పెంపకం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఈజీఎస్ అధికారులకు డీఆర్‌డీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, గోకులపాడు గ్రామాల్లో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలు గరిష్ట కూలి రూ.307 తక్కువ కాకుండా నిర్ణయించినట్లు తెలిపారు. పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగింపు సభను విజయవంతం చేద్దాం

అలంపూర్: భీం దీక్ష ముగింపు సభ విజయవంతం చేద్దామని స్వేరోస్ సెంట్రల్ కమిటీ సభ్యుడు ఎంసీ కేశవరావు అన్నారు. పట్టణంలోని టూరిజం హోటల్‌లో స్వేరోస్ నియోజకవర్గ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో కేశవరావు మాట్లాడుతూ.. మార్చి 15 నుంచి ఏప్రిల్ 14 వరకు భీం దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాన్షీరాం, బాబు జగ్జీవన్‌రాం, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ల జయంతులను పురస్కరించుకొని భీం దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. మనలో దాగిఉన్న సృజనాత్మకత శక్తికి అడుగడుగున అడ్డుపడుతున్న భయాలను దహనం చేయడానికి భీం దీక్ష ముగింపు సమావేశమన్నారు. ఈనెల 13న తలకొండపల్లిలో భీం దీక్ష ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాగజ్యోతి, మహేష్, ప్రభుదాసు, వెంకటేష్, జలంధర్, నాగరాజు, మహేందర్, నాగరాజు నాయుడు, తిరుపాలు, యువరాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవరావు

పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలి



ధరూరు: పరీక్షలకు విద్యార్థులకు సంసిద్ధం చేయాలని ఎంఈఓ రవీంద్రబాబు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని గార్లపాడు ఎంపీహెచ్‌ఎస్, ఉప్పేరు, ఖమ్మంపాడులోని పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ఎస్‌ఏ–2 పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఫలితాలు ప్రకటించాలన్నారు. అదే విధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



గద్వాల: కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. గురువారం జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపు మేరకు పట్టణంలో 19వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలకు బీజేపీ సాధించిన విజయాలు వివరించారు. వార్డులో శుభ్రం చేశారు. విశ్వకర్మ, ముద్రా లోన్లు, ఉజ్వల లబ్ధిదారులను కలిశారు. కార్యక్రమంలో రాఘవేంద్రర్, సోమిశెట్టి, రవి, వెంకట్‌రామ్‌రెడ్డి, చిన్నయ్యనాయుడు, శ్రీధర్, వేణు, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల తనిఖీ



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న మీసేవ కేంద్రాలను గురువారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌కు సంబంధించి ఎక్కడ పొరబాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పారదర్శకంగా పనిచేస్తూ నిర్దేశించిన రుసుం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, మీసేవ నిర్వహకులు సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మల్దకల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



రాజోళిలో సమావేశంలో రాజశేఖర్‌శర్మ

రాజోళి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న ఆయా కార్యక్రమాల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు తప్పక పాల్గొనాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం మండల కేంద్రంలో ముఖ్య నాయలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి మొదలైన ఆవిర్భావ వేడుకలు 14 వరకు జరుగుతాయని అందులో భాగంగా ప్రతి కార్యకర్త, నాయకుడు తమ ఇంటిపై బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. కార్యకర్తలతో కలిసి స్వచ్ఛ భారత్ నిర్వహించి, జెండాలను పట్టుకుని కార్యకర్తలతో కలసి ఊరేగింపు చేయాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన దేశానికి చేసిన సేవలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శశికుమార్, నాయకులు సంజీవరెడ్డి, ఈసీ ఆంజనేయులు, అడివిస్వామి, చిన్నప్ప, వీరేష్, గోవిందురావ్, మల్లేష్ తదిదరులు పాల్గొన్నారు.

అయిజ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. పట్టణంలో బీజేపీ నాయకులతో పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ రెడ్డి మాట్లాడారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. ఓటర్లను చైతన్య వంతులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేన రావు, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, మనురెడ్డి, వీరేష్, లక్ష్మన్న, మహేష్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



అయిజలో మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి

ఎండలు తీవ్రం.. ఈతతో ఉపశమనం



కాల్వలో సరదాగా ఈత కొట్టేందుకు పోటీపడుతున్న యువకులు

ధరూరు: రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఒంటి పూట బడులు ముగియగానే సరదాగా ఈతకు వెళ్తున్నారు. గురువారం మండల పరిధిలోని మార్లబీడులోని యువకులు ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి ఎడమ కాల్వలో సరదాగా ఈత కొడుతూ కనిపించారు. నువ్వా నేనా అంటూ పోటీపడుతూ ఈత కొడుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే పసిప్రాణాలు పోతున్నాయి

అమరచింత: వైద్యుల నిర్లక్ష్యం,ప్రభుత్వ ఆస్పత్రులలో సౌకర్యాలు లేని కారణంగానే ప్రసూతి కోసం వస్తున్న గర్భిణీలు పురిటి నొప్పులలోనే తమ బిడ్డల ప్రాణాలను పొగోట్టు కుంటున్నారంటూ బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో గురువారం డీఎంఆర్ఎం పీహెచ్‌సీ ముందు ఆందోళన నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.సుదీర్‌ల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు,ప్లాకార్డులు ధరించి పట్టణ పురవీదుల గుండా ర్యాలీ నిర్వహిస్తు ఆస్పత్రికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చంద్రగఢ్ గ్రామానికి చెందిన అనిత అనే గర్భిణీ మహిళ పురిటి నొప్పులతో మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిందన్నారు. విదుల్లో ఉన్న స్టాఫ్ నర్సు అనితను పరిశీలించి సాదరణ కాన్పు చేస్తామంటూ ఇంజక్షన్‌లు ఇవ్వడంతో బిడ్డ అడ్డంతిరిగిందన్నారు. పరిస్థితి చేయి దాటిందని అంబులేన్స్‌లో ఆత్మకూర్‌కు తరలించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సరైన వైద్యులు లేకపోవడం, గైనకాలజిస్ట్ లేకపోవడం, సీజేరియన్ చెయ్యడానికి సౌకర్యాలు లేవని తెలిసి ఇక్కడి సిబ్బంది సోంత వైద్యం చెయ్యడం ద్వార అనిత తన బిడ్డ ప్రాణాలను కొల్పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పుకొస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి దారుణ స్థితిలో ఉన్న ఆస్పత్రుల గురించి ఎందుకు పట్టించుకోలేక పోతున్నారన్నారు. గత రెండు నెలల కిందట డీఎంఆర్ఎం ఆస్పత్రికి వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహా పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తున్నని ప్రకటించడం జరిగిందని ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఆస్పత్రి ఉందన్నారు. అనితకు న్యాయం చెయ్యాలని సంబందిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్యదికారి డాక్టర్ ఫయాజ్ అహ్మద్‌కు అందించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిది కదిరే మదు, ప్రధాన కార్యదర్శి బీట్లీ రాజశేఖర్, మరాఠీ అశోక్, మెరువ అనిల్, సత్యనారాయణ, వంశీ, శ్రీనివాసులు, మంగ అంజి పాల్గోన్నారు.



డీఎంఆర్ఎం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు